పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదవాలి

జైనథ్, సెప్టెంబర్ 13 : పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని ఆదిలాబాద్ డీఈవో ప్రణీత సూచించారు. శుక్రవారం జైనథ్ మండలంలోని మేడిగూడ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులు చదవడం, రాయడం నేర్చుకోవాలన్నారు. విద్యార్థులతో బోర్డుపై రాయించి వారి ప్రతిభను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పాఠశాల, వంటశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆమె వెంట డీఈవో సీసీ రాజేశ్వర్, ఉన్నత పాఠశాల హెచ్ఎం సంజీవ్ రెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం వినోద్‌రావ్, ఉపాధ్యాయులు, సీఆర్పీ రాజు ఉన్నారు.

విద్యార్థితో బోర్డుపై రాయిస్తున్న డీఈవో ప్రణీత

గణేశ్ నిమజ్జన శోభాయాత్రను ప్రారంభించిన ఎస్పీ

ముథోల్, సెప్టెంబర్, 13 : ముథోల్‌లో ఏడు రోజుల పాటు పూజలందుకున్న వినాయకులను శుక్రవారం నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా స్థానిక రామమందిరంలోని సార్వజనిక్ వినాయకుడి వద్ద నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల ప్రత్యేక పూజలు చేసి శోభాయాత్రను ప్రారంభించారు. వినాయక నిమజ్జనోత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించి, పోలీసులకు సహకరించాలని సూచించారు. అనంతరం అఖండ బ్రహ్మచారి మండపం వద్ద ఏఎస్పీ అవినాష్ కుమార్, సీఐ మల్లేశ్ పూజలు చేశారు. ఎస్పీ, ఏఎస్పీలకు ఉత్సవ సమితి అధ్యక్షుడు రోళ్ల రమేశ్, ఉపాధ్యక్షుడు తాటివార్ రమేశ్, చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఏఎస్పీ ఆధ్వర్యంలో 200 మంది పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

శోభాయాత్రను ప్రారంభిస్తున్న నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల

నేరడిగొండలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

ఆదిలాబాద్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

నిర్మల్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాంకిషన్‌రెడ్డి, లోలం శ్యాంసుందర్‌ను అరెస్టు చేసిన పోలీసులు

బీఆర్ఎస్‌పై నిర్బంధకాండ

హైదరాబాద్ వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు

- గురువారం రాత్రి నుంచే లీడర్ల ముందస్తు అరెస్టులు
- ఇళ్లల్లోకి చొచ్చుకొచ్చి పోలీస్‌స్టేషన్లకు తరలింపు
- మాజీ మంత్రి జోగురామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గృహనిర్బంధం
- కాంగ్రెస్‌ది నియంతృత్వ పాలన అంటూ ఫైర్

కడెం పోలీస్ స్టేషన్‌లో నినదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


పెంబి పోలీస్ స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

నేరడిగొండలో ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఇంటి వద్ద పోలీసులు

బైంసాటౌన్ : రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

మంచిర్యాల ప్రతినిధి/ఆదిలాబాద్/నిర్మల్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : తెలంగాణలో కాంగ్రెస్ గూండారాజ్ మొదలైంది. కొట్లాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్‌పై నిర్బంధకాండ కొనసాగిస్తున్నది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేసిన నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో నిరసనకు మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపునివ్వగా, పోలీసులు గురువారం రాత్రి నుంచే పార్టీ నాయకులు, కార్యకర్తలను ముందుస్తుగా అరెస్టులు చేశారు. ఇళ్లల్లోకి చొచ్చుకొచ్చి పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి జోగురామన్నను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. శుక్రవారం ఉదయం రామన్న దగ్గరికి వెళ్లిన పోలీసులు ఇల్లు వదిలి బయటికి రావొద్దని సూచించారు. మధ్యాహ్నం హైదరాబాద్ బయలుదేరేందుకు సిద్ధమైన బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ను సైతం పోలీసులు నిర్బంధించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో జడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయకర్త రాంకిషన్‌రెడ్డిని అరెస్టు చేశారు. మంచిర్యాల జిల్లాలో నస్పూర్, బెల్లంపల్లి, కోటపల్లి, భీమారం మండల కేంద్రాలతో పాటు నిర్మల్ జిల్లాలో ఖానాపూర్, కడెం, పెంబి, కుంటాల మండలాలు సహా ఆదిలాబాద్ జిల్లాలో ఇంద్రవెల్లి, ఉట్నూర్, తాంసి, నార్నూర్, తలమడుగు, బేల, సిరికొండ, బోథ్ మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేయగా, తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కారు రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలకు నిరసనలు తెలిపే స్వాతంత్ర్యం లేకుండా పోయిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ అంటే కాంగ్రెస్‌కు భయమని, అందుకే మా పార్టీ కార్యకర్తలను హైదరాబాద్‌కు రాకుండా అడ్డుకున్నదన్నారు. పోలీసులను ప్రత్యేకంగా మోహరించి అరెస్టులు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందంటూ ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి, మాజీ మంత్రుల అక్రమ అరెస్టులపై కాంగ్రెస్ పార్టీ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కాంగ్రెస్ లీడర్లు దాడి చేయడంపై తెలంగాణ సమాజం మండిపడుతున్నది.

ఆదిలాబాద్‌లోని తన నివాసంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిరసన తెలుపుతున్న మాజీమంత్రి జోగు రామన్న

రాష్ట్రంలో రౌడీరాజ్యం

కాంగ్రెస్ సర్కారు బీఆర్ఎస్‌కు భయపడి మా శ్రేణులను అరెస్ట్‌లు చేయిస్తున్నది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అప్రజాస్వామికంగా వ్యవహరిస్తూ కాంగ్రెస్ రౌడీలతో దాడులు చేయిస్తున్నది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం శాంతియుతంగా ఉన్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే శాంతిభద్రతలు అదుపుతప్పాయి. అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయి. ఓటుకు నోటు కేసులు పట్టపగలు దొరికిన దొంగ సీఎం రేవంత్ రెడ్డికి రౌడీయిజం అలవాటే. కౌశిక్‌రెడ్డి ఇంటిపై ముఖ్యమంత్రి కాంగ్రెస్ రౌడీలను పంపి దాడి చేయించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు చక్కగా ఉంటే పెట్టుబడులు వచ్చి యువతకు ఉపాధి లభిస్తుంది. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, రైతు రుణమాఫీ, రైతుభరోసా, పింఛన్లు, కల్యాణలక్ష్మి వంటి పథకాలు అమలు చేయలేక ప్రజల దృష్టిని మరల్చేందుకు ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నది.

- జోగు రామన్న, మాజీమంత్రి

సీఎం రేవంత్‌రెడ్డి ప్రోత్సాహంతోనే దాడులు

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై దాడుల పాలన గా మారింది. ప్రజల చేత ఎన్నుకోబడిన ఎమ్మెల్యేలకు రక్షణ లేనప్పుడు సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై ఎమ్మెల్యే అరికేపూడి గాంధీ, ఆయన అనుచరులు చేసిన దాడిని ఖండిస్తున్నాం. మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఇతర ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్ట్ చేయడం దారుణం. హైదరాబాద్‌కు నిరసన తెలిపేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రోత్సాహంతోనే బీఆర్ఎస్ నాయకులపై దాడులు జరుగుతున్నాయి. పదేళ్ల తర్వాత రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపుతప్పాయి. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాల్సిన ముఖ్యమంత్రి అల్లర్లు సృష్టిస్తున్నారు.

- అనిల్ జాదవ్, బోథ్ ఎమ్మెల్యే

ఖానాపూర్ టౌన్ : పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

ఉట్నూర్ : పోలీస్ స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

ఖానాపూర్/కడెం, సెప్టెంబర్ 13: ప్రజా పాలన ముసుగులో సీఎం రేవంత్‌రెడ్డి నియంత పాలన కొనసాగిస్తున్నారు. దాడికి పాల్పడిన అరికెపూడి గాంధీతో పాటు ఆయన అనుచరులను అరెస్టు చేసి హత్యాయత్నం కేసు నమోదు చేయాలి. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, నాయకులపై పోలీసులు వ్యవహరించిన తీరు సరికాదు. బీఆర్ఎస్ నేతలంటే సీఎం రేవంత్‌రెడ్డికి ఎందుకు వణుకు పడుతుంది. ? దాడి చేసిన వారిని వీడిచి బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేయడం సిగ్గుచేటు. సీఎం ప్రోద్బలంతో జరుగుతున్న అక్రమ విధానాలను ప్రజలు గ్రహిస్తున్నారు. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీకి రానున్న రోజుల్లో తగిన గుణపాఠం తప్పదు.

-ఖానాపూర్ బీఆర్ఎస్ నేత భూక్యా జాన్సన్ నాయక్

నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించాలి

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

జైనథ్/ఎదులాపురం, సెప్టెంబర్ 13 : జిల్లాలో వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఈ నెల 7న కొలువుదీరిన గణనాథుల నిమజ్జనోత్సవాన్ని ఆయా గ్రామాల్లోని చెరువు, నదుల వద్ద భక్తి శ్రద్ధలతో ప్రశాంతంగా నిర్వహించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ గౌస్ ఆలం సూచించారు. శుక్రవారం జైనథ్ మండలంలోని నిమజ్జన ప్రాంతమైన డొల్లార సరిహద్దులోని పెన్‌గంగ నదిని పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులు, రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 17న జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ నుంచి గణేశ్ విగ్రహాలు పెద్ద సంఖ్యలో రానున్న నేపథ్యంలో అన్ని సౌకర్యాలను కల్పించాలని అధికారులకు సూచించారు.

శోభాయాత్ర రూట్‌మ్యాప్ పరిశీలన

గణేశ్ నిమజ్జన శోభాయాత్ర వెళ్లే మార్గాలను ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం పరిశీలించారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్, వినాయక చౌక్, అంబేద్కర్ చౌక్, చాంద, పెన్‌గంగ వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు. 7, 9, 11వ రోజుల్లో వినాయక నిమజ్జనాలు జరుగుతాయని, ఇందుకు అధికారులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ వెంట ట్రెయినీ కలెక్టర్ అభిగ్యాన్, డీఎస్పీ జీవన్ రెడ్డి, ఆర్డీవో వినోద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, రూరల్ సీఐ సాయినాథ్, జైనథ్ తహసీల్దార్ శ్యాం సుందర్, నీటిపారుదల శాఖాధికారులు, ఆయా శాఖాధికారులు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పెన్‌గంగ నది వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం

గణనాథుడికి ప్రత్యేక పూజలు

నేరడిగొండ, సెప్టెంబర్ 13 : మండలంలోని సక్రియనాయక్‌తండా, లింగట్ల, మాట్లొద్ది, నేరడిగొండలోని మధురకాలనీలోని గణేశ్ మండపాల వద్ద బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. మండపాల నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, పీఏసీఎస్ చైర్మన్ సాబ్లె కిశోర్‌సింగ్, ఇచ్చోడ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, వీడీసీ చైర్మన్ ఏలేటి రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుమల్‌గౌడ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లె నానక్‌సింగ్, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులున్నారు.

ఆధ్యాత్మికత ఉట్టిపడేలా వేడుకలు

జైనథ్, సెప్టెంబర్ 13 : ఆధ్యాత్మికత ఉట్టిపడేలా వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని మాజీ జోగు రామన్న అన్నారు. జైనథ్ మండలంలోని దీపాయిగూడలోని రామమందిరంలో ప్రతిష్ఠించిన వినాయక మండపంలో పూజలు చేశారు. అనంతరం అన్నదానంలో పాల్గొని భక్తులతో కలిసి భోజనం చేశారు. మాజీ మంత్రి వెంట నూతుల మురళీ, అల్లూరి భీంరెడ్డి, మోహన్ రెడ్డి, బద్ధం పోతారెడ్డి, ఉపేందర్ రెడ్డి, లస్మన్న, యాళ్ల లింగారెడ్డి, లోక కృష్ణారెడ్డి, దాసరి రవీందర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేరడిగొండ : ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

జైనథ్ : దీపాయిగూడలో భోజనం చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలి

-అదనపు కలెక్టర్ శ్యామలా దేవి

ఎదులాపురం, సెప్టెంబర్ 13: యువత మత్తుపదార్థాలకు అలవాటు పడి జీవితాన్ని నశానం చేసుకోవద్దని ఆదిలాబాద్ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి సూచించారు. 'నషా ముక్త్ భారత్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి చేపట్టిన ర్యాలీని అదనపు కలెక్టర్ ప్రారంభించారు. యువత డ్రగ్స్, గంజాయికి అలవాటు పడి వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టడం అభినందనీయన్నారు. జిల్లాలో 6 నెలల్లో 100కు పైగా గంజాయి కేసులను నమోదు చేసినట్లు డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఏసీ వెంకటేశ్వర్లు, బ్రహ్మకుమారీస్ రేవతి, ఎక్సైజ్ శాఖ అధికారులు, డాన్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి దేవేందర్ తదితరులున్నారు.

గురుకుల డిగ్రీ కళాశాలను సందర్శించిన 'న్యాక్'

ఉట్నూర్ రూరల్, సెప్టెంబర్ 13: ఉట్నూర్ మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్‌లోని తెలంగాణ గురుకుల బాలికల డిగ్రీ కళాశాలను (న్యాక్) నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ బృందం సభ్యులు నెహ్రూ, ఉమారాణి, రామినేని శివరామ ప్రసాద్, సాజిమోల్ అగస్టిన్ మూడు రోజుల పాటు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బానోత్ హరిత డిపార్ట్‌మెంట్ల వారీగా ప్రజెంటేషన్ వారికి అందించారు. అనంతరం టీం సభ్యులు కళాశాల విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, అధ్యాపకుల బోధనలు, ల్యాబ్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, హెల్త్ సెంటర్, క్రీడల గది, మైదానం, భోజనశాలను పరిశీలించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చాగోష్ఠి నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించి అభినందించారు. అనంతరం అధ్యాపకులతో బోధన విధానాలపై చర్చించి సలహాలు సూచనలు అందించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి కళాశాల బృందాన్ని అభినందించారు. కళాశాల పరిశీలన రిపోర్టును ప్రత్యేక సీల్డ్ కవర్‌లో ప్రిన్సిపాల్‌కు అందించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌కు సర్టిఫికెట్ అందిస్తున్న న్యాక్ బృందం సభ్యులు